# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | మంగళవారం 29 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 141


తెలుగు దినపత్రిక


## మెగాస్టార్ కు అక్కినేని పురస్కారం..



- ప్రదానం చేసిన అమితాబ్
- భావో ద్వేగానికి గురైన చిరంజీవి

..........వివరాలు 4లో



## చట్టప్రకారం ముందుకెళ్లండి..

- హైకోర్టుకు రాజ్ పాకాల
- అక్రమంగా అరెస్ట్ చేసే కుట్రలంటూ పిటిషన్
- ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం..
- ఇంటికి నోటీసులు అంటించిన పోలీసులు..

2

## రైతు సంక్షేమానికి ప్రాధాన్యం..

- సాంకేతిక పరిజ్ఞానంతో లాభాలు పెంచేలా పైలట్ ప్రాజెక్ట్ రూపొందిస్తున్నాం
- చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం..
- దీపావళి నుంచి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- మంథని మార్కెట్ యార్డ్, ఏక్లాస్ పూర్ లో కొనుగోలు కేంద్రాల ప్రారంభం

3

# ప్రక్షాళన షురూ

## 13 మంది ఐఏఎస్ లకు స్థాన చలనం

### 70 మంది డిప్యూటీ కలెక్టర్లు, ఎస్‌డీపీల ట్రాన్స్ ఫర్
### ముగ్గురు ఐఎఫ్ఎస్ లూ బదిలీ
### కొత్త చట్టానికి ముందే దిద్దుబాటు..




**జనపదం, హైదరాబాద్ సిటీ:**

రాష్ట్రంలో ఒకేరోజు కీలక బదిలీలు జరిగాయి. 13 మంది ఐఏఎస్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు రెవెన్యూలో ఒకేసారి 70 మందిని ట్రాన్స్ఫర్ చేశారు. డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఐఏఎస్ల బదిలీల్లో భాగంగా రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణ రెడ్డి, నల్లగొండ కలెక్టర్‌గా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా హనుమంతరావు, పురపాలక శాఖ సంచాలకులుగా టీకే శ్రీదేవి, సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మందా మకరందు, పర్యాటక శాఖ సంచాలకులుగా జెడ్ కే హనుమంతు, దేవాదాయ శాఖ సంచాలకులుగా హనుమంతకు అదనపు బాధ్యతలు, ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్‌గా ఎస్ హరీశ్, విపత్తు నిర్వహణ శాఖ సంయుక్త కార్యదర్శి హరీశ్‌కు అదనపు బాధ్యతలు, ఆర్ అండ్ ఆర్, భూసేకరణ కమిషనర్‌గా వినయ్ కృష్ణా రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు, డెయిరీ కార్పొరేషన్ ఎండీగా కే చంద్రశేఖర్ రెడ్డి, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్ దిలీప్ కుమార్ ను బదిలీ చేశారు. ఇక, ముగ్గురు ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీ కూడా జరిగింది. వికారాబాద్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్గా రాజన్నను నియమించారు. ఎస్సీ డెవలప్‌మెంట్ ఎండీగా క్షితిజ, జీహెచ్ఎంసీ సర్కిల్ ఎంఏయూడీ అడిషనల్ కమిషనర్‌గా సుభద్రాదేవిని ట్రాన్స్ఫర్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**రెవెన్యూ ప్రక్షాళన**

రాష్ట్రంలో రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏకంగా 70 మంది డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ ......(తరువాయి 3లో)



తన మార్కు రాజకీయం. మాట్లాడినంత తేలిక కాదని గ్రహించిన నాయకత్వం. మొదట్లో సెక్యూరిటీ వద్దు., సిగ్నల్ జంపింగ్లు అస్సలే ఉండొద్దు., ట్రాఫిక్ ను నిలుపొద్దు., నేను ఓ సాధారణ వ్యక్తిలాగానే., నా వల్ల జనం బాధపడొద్దు.., అని గొప్పలకు పోయిన రాజులకు ఒక్క దెబ్బతో చుక్కలు కనిపించాయి. గిర్రున కళ్లు తిరిగి కంచెలు వెలిసేలా చేశాయి. మొన్నటి వరకు కలువ డానికి ఏమంత ఇబ్బందులు లేని వాతావరణం ఇప్పుడు నిబంధనల ఛత్రంలో బంధించబడి కష్టతరమైంది. ఇంటెలిజెన్స్ ఇన్ఫర్మేషనో.., లేదంటే పోలీసింగ్ లో సాగుతున్న ఏక్ స్టేట్ రచ్చోగానీ ముఖ్యమంత్రి భద్రత పెరిగింది., రాష్ట్రంలో ప్రకటిత కర్ఫ్యూ అమలులోకి వచ్చింది.

# ఏరాయైతేనేం..?
# సేమ్ టు సేమ్..

## రాష్ట్రంలో ప్రకటిత కర్ఫ్యూ

- అప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్..
- నగరంలో కట్టుదిట్టంగా భద్రత..
- గుమిగూడితే కేసులే..
- సచివాలయం చుట్టూ మరింత నిఘా
- షరామాములుగానే ప్రభుత్వాల తీరు..
- తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి హరీష్ రావు
- ప్రజాపాలన కాదు.. ప్రజా పీడన అంటూ విమర్శలు..

**జనపదం, బ్యూరో ఛీఫ్**

ప్రజలు ప్రజలే., ప్రభువులు ప్రభువులే. ఏదో ఎన్నికల స్టంట్ కు ఎన్నెన్నో చెప్తారు., అక్కర ఒడ్డెక్కించుకునేందుకు పడరాని పాట్లు పడుతారు. గెలిచిన తర్వాత వెంటనే లేని ఫోజులకు పోతే ప్రజల్లో తప్పుడు సంకేతాలు పోతాయని కొద్దిగా కలరింగ్ ఇస్తూ సమయాన్ని గడుపుతారు. ఒక్కసారి ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న అన్నట్టుగా ఏదన్న సాకు దొరికితే చాలు షరామాములుగానే అంతరాలు వెతుకుతారు., దూరాలు పెంచుతారు.., అంతిమంగా దర్శన భాగ్యాలు అతి కష్టం చేస్తారు. తాజాగా రాష్ట్రంలో అప్రకటిత కర్ఫ్యూతో అలాంటి వాతావరణమే కనిపిస్తున్నది. మొన్నటి దాకా సర్కార్ పెద్దలను కలవాలంటే కాస్తోకూస్తో తేలిగ్గానే జరిగే పని ఇప్పుడు విపరీతమైన ......(తరువాయి 2లో)

## పోలీస్ వర్సెస్ పోలీస్



### సర్కారులో 'ఏక్' చిచ్చు

2

| రోడ్డెక్కిన బెటాలియన్ ఖాకీలు | కట్టడి చేస్తున్న సివిల్ పోలీసులు | ఆగమవుతున్న కుటుంబాలు |
|---|---|---|
| ఇప్పటికే కొంత మందిపై వేటు | సీఎం ఇంటి దగ్గర భద్రతా చర్యలు | పోలీస్ బాస్ నుంచి హెచ్చరికలు |



## రాష్ట్రంలో ప్రజా పీడన

- ఏ వర్గానికి న్యాయం జరగడం లేదు
- కంచె లేని పాలన అని ఆంక్షల పాలన తీసుకొచ్చారు
- రక్షకభటులకే రక్షణ లేని పరిస్థితి
- పోలీసు కుటుంబాలు రోడెక్కితే బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడరు..?
- మాజీమంత్రి హరీష్ రావు

2



# సమగ్రంగా సర్వే

- 7 పేజీల్లో 54 అంశాలతో ఫార్మాట్
- కుల గణనకు సిద్ధమైన ప్రణాళిక విభాగం
- ఆస్తులు, పదవులు.. వ్యాధులు.. అన్నీ సేకరణ
- మళ్లీ సమగ్ర కుటుంబ సర్వే..!

**జనపదం, బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే కులగణన కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఇప్పటికే 54 ప్రశ్నలతో 7 పేజీలను రూపొందించిన ప్రణాళిక శాఖ ఇందులో ఆస్తులు, రిజర్వేషన్ల ద్వారా లబ్ధిపొందిన వివరాలను సేకరించేలా కొత్త ఫార్మాట్ తయారు చేసింది. ప్రతి కుటుంబ సమగ్ర సమాచారాన్ని సేకరించేలా 54 ప్రశ్నలతో 7 పేజీల ఫార్మాట్ను అధికారులకు జారీ చేసింది. ఈ మేరకు ఇంటి నంబర్లకు ప్రత్యేక కోడ్ కేటాయించి పూర్తి సమాచారాన్ని నమోదు చేసేలా ప్లాన్ చేస్తున్నది.

**ఎలా.. ఏమిటీ..?**

రాష్ట్ర ప్రభుత్వం కుల గణనకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో ఉన్న జనాభా ఆధారంగా ఏ కులం జనాభా సంఖ్య ఏ మేరకు ఉంది? వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, ఇంకా అందించాల్సిన పథకాలు ఏమైనా ఉన్నాయా? తదితర అంశాలపై ఫోకస్ చేస్తూ వచ్చేనెల నుంచి సమగ్ర కులగణనను ......(తరువాయి 4లో)



## ఇప్పుడు యాదికొచ్చిందా..?

- ఇన్నాళ్లు ఏం చేసినట్టో..
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- బీజేపీ, కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు..
- ఓబీసీల లెక్కలు తేల్చాలని డిమాండ్..

4

## బీసీ కమిషన్ వచ్చిందోచ్..

- మొదలైన జిల్లాల పర్యటనలు
- షెడ్యూల్ విడుదల..
- నవంబర్ 13 వరకు అభ్యంతరాల స్వీకరణ..

4




## నకిలీ వకీళ్లు..

- 107 మందిని తొలగించిన బార్ కౌన్సిల్
- తప్పుడు పత్రాలతో పేర్లు నమోదు..
- పరిశీలనలో మరి కొందరి పేర్లు..

3

## అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీ

- 6 వేల మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు...
- డిజైన్‌లను రూపొందించిన ప్రభుత్వం
- నవంబర్ 6వ తేదీన పనులు ప్రారంభం
- పది నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని సీఎంఆదేశం
- అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటు

2

# గురుకులాల్లో మెరుగైన వసతులు..

- కొత్తగా 8 సివోఇలు
- యూనిఫామ్ తో పాటుగా రెండు జతల నైట్ డ్రెస్సులు
- 104 స్కూల్‌లలో ఆర్వో ప్లాంట్లు..,
- సోలార్ వాటర్ హీటర్స్
- ఒకేషనల్ కోర్సుల సంఖ్య పెంపు



**జనపదం, హైదరాబాద్:**

గురుకుల విద్యాలయాల్లో మెరుగైన సదుపాయాలు అందించేందుకు కృషి చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్స్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధికారులతో సెక్రటేరియట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. బోర్డు ఆఫ్ గవర్నెన్స్ లో తీసుకున్న నిర్ణయాల్లో అమలైన, పెండింగ్ పనులపై మంత్రి పొన్నం ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్య అవకాశాలు కల్పించేలా ప్రస్తుతం ఉన్న రెండు సీఈఓల సంఖ్యను పదికి పెంచుతున్నట్లుగా తెలిపారు. దీంతో ......(తరువాయి 2లో)



## హైడ్రా ఓ బ్లాక్ మెయిల్ సంస్థ

- రేవంత్ అండ్ క్యాబినెట్ నిర్వాకం ప్రజలు గమనిస్తున్నారు
- పెద్ద బిల్డర్లను బ్లాక్ మెయిల్ చేసి వసూళ్లు చేస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బుచ్చమ్మ కుటుంబానికి పరామర్శ..
- అండగా ఉంటామని భరోసా..

4

# ప్రస్తుతానికి సేఫ్..

- కరెంట్ వడ్డింపు నుంచి ఉపశమనం..
- సామాన్యులపై ఎటువంటి విద్యుత్ భారం ఉండదు
- చేనేత కార్మికులకు పవర్ పరిమితి పెంపు..
- డిస్కంలకు రావాల్సిన బకాయిలు సుమారు రూ.25వేల కోట్లు
- ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు



**జనపదం, హైదరాబాద్ బ్యూరో:**

సామాన్య వినియోగదారులపై ఎటువంటి విద్యుత్ భారం ఉండబోదని ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు వెల్లడించారు. 800 యూనిట్లు దాటిన వినియోగదారులపై స్వల్పంగా ఛార్జీల పెంపు ఉంటుందని తెలిపారు. విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులు, వినియోగదారులు, ప్రభుత్వ రాయితీలను దృష్టిలో పెట్టుకొని కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు ఏ కేటగిరిలోనూ పెంచడం లేదన్నారు. స్థిర ఛార్జీలు రూ.10 యథాతథంగా ఉంటుందన్నారు. నీటిపారుదలకు సంబంధించి టైమ్ ఆఫ్ డే పీక్ అవర్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల మధ్య నాన్ పీక్ అవర్లో రాయితీని రూపాయి నుంచి రూపాయిన్నరకు పెంచినట్లు చెప్పారు. గృహ వినియోగదారులకు మినిమం ఛార్జీలు తొలగించామన్నారు. గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలను కమిషన్ ఆమోదించిందని ఛైర్మన్ రంగారావు తెలిపారు. అయితే, ఇవి కేవలం ఐదు నెలల వరకే ఉంటాయన్నారు. పౌల్ట్రీ, గోట్ ఫాంలను కమిషన్ ఆమోదించలేదని చెప్పారు. చేనేత కార్మికులకు హార్స్ పవర్ హెచ్పీ 10 నుంచి 25కి పెంచామన్నారు. ......(తరువాయి 4లో)



## ఉప ఎన్నికలో పదికి పది గెలుస్తాం

### కొత్తగూడెం బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతా రావు

**జనపదం, ఖమ్మం :** కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల స్థానంలో ఉప ఎన్నికలు జరిగితే పదికి పదిస్థానాల్లో బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతా రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం భద్రాచలంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలకు పార్టీ మారినట్లు చెప్పుకొనే ధైర్యం కూడా లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకొని కూడా మేం పార్టీ మారలేదని బుకాయిస్తున్నారని విమర్శించారు. అబద్దాల పునాదులపై గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో కక్ష సాధింపు పాలన సాగుతుందన్నారు. ఖజానాలో డబ్బులు లేవంటూనే మంత్రులు విదేశాల్లో పర్యటించడం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు మానే రామ కృష్ణ, సోయం రాజా రావు, శ్రీనివాస రాజు, ఆకోజు సునిల్ కుమార్, కణితి రాయుడు, కోల రాజు, రేసు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏరాయైతేనేం..? సేమ్ టు సేమ్..

**(మొదటిపేజీ తరువాయి)** ప్రయాసతో కూడినదిగా మార్చారు.

**కంచెలు మొలుస్తున్నాయి..**

రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడగానే బీఆర్ఎస్ సర్కార్ పెట్టిన కంచెలపై విరుచుకుపడ్డారు. ఇవేమన్నా గడీల పాలనా.., వాళ్లేమన్నా దొరల పెత్తనమా..? అని రోడ్డుపై వెలిసిన ఇనుప కంచెలను ఉన్నఫలంగా తొలగించారు. ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయడానికి అవకాశం కల్పించి శభాష్ అనిపించుకున్నారు. ఇది కదా మేం కోరుకున్న పాలన అని అందరూ సంబురపడేలా నడుచుకున్నారు. కేసీఆర్ గంజిలో ఈగ మాదిరిగా తీసేసేవాడని, మనిషిని కనీసంగా కూడా గుర్తించని పొగరుబోతని దుమ్మెత్తిపోసిన వారు ఇప్పుడు మళ్లీ అదే తీరును చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. డోలు పోయి మద్దెల వచ్చింది అన్నట్టుగా ముచ్చటించుకున్నారు. నగరమంతా అందునా సచివాలయం పరిసరాలన్నీ కంచెలు ఏర్పాటు చేయడంతో ఆ పదేళ్ల రోజులే పునరావృతం అవుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయని పలువురు బహిరంగంగానే పేర్కొంటున్నారు. గుమిగూడితే కేసులు., మాట్లాడితే ఎంక్వైరీలు., ప్రశ్నిస్తే కటకటాలు.. అంటూ కొత్త పాలసీకి సర్కార్ బీజం వేయడంతో ఏ రాయి అయితేనేమీ అన్నట్టుగా మారింది పరిస్థితి.

**సచివాలయం చుట్టూ నిఘా..**

ఇంటిలిజెన్స్ హెచ్చరికలో మరేమోగానీ సచివాలయం చుట్టూరా నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేశారు. ఎంతో ఉపశమనం అనిపించిన పరిస్థితిని ఇప్పుడు మళ్లీ కష్టతరంగా మార్చుతున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేఖ ధోరణి పెరుగుతున్న తరుణంలో నిరసన కారులు ఎదురు తిరుగుతూ సచివాలయం ముట్టడి, ఇతర భవనాల వద్ద గొంతెత్తి నినదించడం చేస్తుండడంతో నిబంధనలకు పదును పెరుగుతున్నది. డీజీపీ కూడా భద్రత చర్యలపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఏదిఏమైనా ప్రభుత్వాల మార్పుతో ప్రజలకు ఒరిగిందేమీ ఉండదని, నాయకుల దృష్టిలో జనాలను ఓటర్లుగా తప్ప మరే బంధంతో చూడరనే విషయం కేవలం పదినెలల కాంగ్రెస్ పాలనతోనే తేటతెల్లమైంది.

## భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

### హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**జనపదం, సిటీబ్యూరో:** టపాసుల దుకాణదారులు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లోనే క్రాకర్స్ దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు బొగ్గులకుంటలో అగ్ని ప్రమాదానికి గురైన క్రాకర్స్ దుకాణా ప్రాంతాన్ని రంగనాథ్ పరిశీలించారు. అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన క్రాకర్స్ దుకాణాన్ని ఆ పక్కనే ఆహుతి అయిన టిఫిన్ సెంటర్‌ను పరిశీలించి, ప్రమాదానికి కారణాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన దుకాణానికి అనుమతులు లేవని, ఆ దగ్గర్లోని బహిరంగ ప్రదేశంలో దీపావళి సందర్భంగా తాత్కాలిక క్రాకర్స్ దుకాణం ఏర్పాటు చేయడానికి అనుమతులు పొంది, ఇక్కడ షట్టర్లో ఎలాంటి అనుమతులు లేకుండా అమ్మకాలు చేపట్టారని అధికారులు హైడ్రా కమిషనర్‌కు వివరించారు. అనంతరం హైదరాబాద్ లోని వెంగళరావు నగర్ – మోతీనగర్ మార్గంలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని రంగనాథ్ పరిశీలించారు. నలంద స్కూల్‌కు చేరువలో ఉన్న 9800 చదరపు గజాల స్థలం పార్కు కోసం కేటాయించారని, కొంతమంది ఆక్రమించి ఉన్నారని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

# హైకోర్టుకు రాజ్ పాకాల

- అక్రమంగా అరెస్ట్ చేసే కుట్రలంటూ పిటిషన్
- ఇరువురి వాదనలు విన్న కోర్టు
- చట్టప్రకారం ముందుకెళ్లాలని ఆదేశాలు
- అజ్ఞాతంలోకి రాజ్ పాకాల..!
- ఇంటికి నోటీసులు అంటించిన పోలీసులు

**జనపదం, బ్యూరో:** జన్వాడ్ ఫాంహౌస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం హైకోర్టులో రాజ్ పాకాల లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. పోలీసులు తనని అక్రమంగా అరెస్టు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారన్న సమాచారం నేపథ్యంలో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు వీలుగా ముందుస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో రాజ్ పాకాల పిటిషన్ వేసినట్లు తెలుస్తోంది.

### చట్ట ప్రకారం ముందుకెళ్లండి..

రాజ్ పాకాల తరపున మయూర్‌రెడ్డి వాదనలు వినిపించగా, ఇంట్లో పార్టీ చేసుకుంటే అక్రమంగా పోలీసులు వచ్చి రైడ్ చేశారన్నారు. ఆయన కంపెనీలో పని చేసే ఉద్యోగికి డ్రగ్స్ పాజిటివ్ వస్తే రాజ్ పాకాలను నిందితుడిగా చేర్చారని కోర్టుకు వివరించారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసు పెట్టారని, సోమవారం ఉదయం 9.30కి నోటీసులు పంపించి..



11 గంటలకు విచారణకు రమ్మన్నారని కోర్టుకు ఆయన తెలిపారు. పోలీసుల తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. అరెస్టు చేస్తామని తాము ఎక్కడా చెప్పలేదని, ఇప్పటి వరకు ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అక్రమంగా మద్యం సీసాలు లభించడంతోపాటు విజయ్ మద్దూరి అనే వ్యక్తికి డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిందని చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, నిబంధనల ప్రకారమే రాజ్ పాకాలకు 41ఏ నోటీసులు ఇచ్చామని ఏజీ వివరించారు. ఈ మేరకు దర్యాప్తులో తీవ్ర నిర్ణయాలేమీ తీసుకోబోమని కోర్టుకు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం పోలీసుల ఎదుట హాజరయ్యేందుకు పిటిషనర్‌కు రెండు రోజుల గడువు ఇచ్చింది. చట్టప్రకారం ముందుకెళ్లాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

### అజ్ఞాతంలోకి రాజ్ పాకాల

మరోవైపు ఫామ్ హౌస్ ఘటన అనంతరం రాజ్ పాకాల అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అలాగే ఫోన్ కూడా స్విచ్ఆఫ్ చేసినట్లు సమాచారం. ఫోన్ సిగ్నల్ ద్వారా రాజ్ పాకాల ఆచూకీ కనుగొని అరెస్ట్ చేసే అవకాశం ఉన్నందున ఫోన్‌ను కూడా రాజ్ పాకాల స్విచ్ఆఫ్ చేసినట్లు తెలుస్తోంది. అయితే రాజ్‌పాకాల హైదరాబాద్‌లోనే ఉన్నారా లేక వేరే ఎక్కడికైనా వెళ్లిపోయారా అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు అయినందున అందుకు అనుగుణంగానే రాజ్ పాకాలను విచారించాలని పోలీసులు భావించగా.. అప్పటికే ఆయన కనిపించకుండా పోయారు.

### సహకరిస్తానని చెప్పి..

రాజ్ పాకాలకు మోకిలా పోలీసులు నోటీసులు ఇవ్వాలని భావించారు. అయితే తాను విచారణకు సహకరిస్తానని.. ఎప్పుడు పిలిచినా వస్తానని రాజ్ పాకాల చెప్పినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పోలీసులు వెనుదిగారు. అయితే సాయంత్రం వరకు రాజ్ పాకాల కోసం పోలీసులు ఎదురు చూసినప్పటికీ ఆయన రాకపోవడంతో పోలీసులు నోటీసులు జారీ చేశారు. రాజ్ పాకాల అందుబాటులో లేని నేపథ్యంలో ఆయన నివసించే విల్లా గోడకు నోటీసును అంటించారు. సోమవారం ఉదయం విచారణకు రావాలని పోలీసులు స్పష్టంగా చెప్పినప్పటికీ ఇప్పటి వరకు రాజ్ పాకాల విచారణకు హాజరుకాని పరిస్థితి. ప్రధానంగా ఈ కేసులో రాజ్ పాకాల కీలకంగా ఉన్న నేపథ్యంలో ఆయనను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి రావచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీ

- 6 వేల మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు...
- డిజైన్‌లను రూపొందించిన ప్రభుత్వం
- నవంబర్ 6వ తేదీన పనులు ప్రారంభం
- పది నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని సీఎం ఆదేశం

**జనపదం, హైదరాబాద్ సిటీ:** యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రమాణాలతో, అధునాతనంగా నిర్మాణం జరుగనుంది. సువిశాల ప్రాంగణంలో 6 వేల మందికి శిక్షణ ఇచ్చేలా, అందులో వారి కోసం మౌలిక సదుపాయాలు కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యూనివర్సిటీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం డిజైన్లు తయారు చేయించింది. కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలో దాదాపు 57 ఎకరాల విస్తీర్ణంలోని యూనివర్సిటీ స్థలంలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌తో పాటు అకాడమిక్



బ్లాక్, వర్క్‌షాపులు, గర్ల్, బాయ్స్ హాస్టల్ బిల్డింగ్‌లు, డైనింగ్ హాల్, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు ఆడిటోరియం, లైబ్రరీ, సువిశాల మైదానం, పార్కింగ్ ఏరియా ఉండేలా ఈ డిజైన్‌లను ప్రభుత్వం రూపొందిస్తోంది. సువిశాల ప్రాంగణంలో ఎక్కువ ఖాళీ స్థలం, గ్రీనరీ ఉండేలా భవన నమూనాలను ప్రభుత్వ తయారు చేయిస్తోంది. ఆరు వేల మంది విద్యార్థుల నైపుణ్య శిక్షణ, వసతి సదుపాయాలు ఉండేలా క్యాంపస్‌లో నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టనుంది. అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్‌లను అమర్చనున్నారు. వీటితో పాటు విద్యుత్ వినియోగం తగ్గించేలా ఏసీల వాడకం లేకుండా కొన్ని భవనాల్లో గాలి వెలుతురు ఉండేలా అధునాతన డిజైన్‌లలో వర్క్ షాపులు, అకాడమిక్ బిల్డింగ్‌లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### విరాళాల ద్వారా సమీకరించిన నిధులు

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ఉండడంతో పాటు ఈ యూనివర్సిటీ క్యాంపస్ దేశం దృష్టిని ఆకర్షించేలా నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్కిటెక్ట్ ఇంజినీర్లకు, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన మేఘా కంపెనీ ప్రతినిధులకు సూచించారు. నవంబర్ 6వ తేదీన పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎనిమిది నుంచి పది నెలల్లోగా ఈ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి మేఘా కంపెనీ ఇటీవలే రూ.200 కోట్లు విరాళం అందించింది. తమ ఇంజినీరింగ్ నైపుణ్యంతో క్యాంపస్‌ను అధునాతనంగా నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఇటీవలే అదానీ కంపెనీ స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు విరాళం అందించింది. వీటితో పాటు వివిధ కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యం, విరాళాల ద్వారా సమీకరించిన నిధులన్నీ కార్పస్ ఫండ్ కింద జమ చేస్తోంది. వీటితో యూనివర్సిటీ నిర్వహణకు భవిష్యత్‌లో ఆర్థికపరమైన ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది.

# పోలీస్ వర్సెస్ పోలీస్

- సర్కారులో 'ఏక్' చిచ్చు
- రోడ్డెక్కిన బెటాలియన్ ఖాకీలు
- కట్టడి చేస్తున్న సివిల్ పోలీసులు
- ఆగమవుతున్న కుటుంబాలు
- ఇప్పటికే కొంతమందిపై వేటు
- సీఎం ఇంటి దగ్గర భద్రతా చర్యలు
- పోలీస్ బాస్ నుంచి హెచ్చరికలు



**జనపదం, బ్యూరో:** ఒకప్పుడు.. ప్రజా నాట్యమండలి పాట గుర్తు చేసుకుందాం.. "నాసా కింద.. నీసా కింద నిన్ను జైళ్ల పెట్టినారు.. నీకు.. నాకు తేడా లేదురో.. ఓ పోలీసన్న.. రాళ్ల వర్షం కురుస్తుంటే రణం చేయ దుంకుతావు.. కత్తులు కత్తు లు లేపుకున్నా కొట్లాటలు ఆపుతావు.. కన్ను భగ్గున మం డినా టియర్ గ్యాస్ వదులుతావు.. నీ బతుకంతా రిస్కే న న్నా.. ఓ పోలీసున్న.. నేనూ సమ్మె చేసినప్పుడు.. సమ్మెనాప నిన్ను దించే.. నీవు సమ్మె చేసినప్పుడు సీఆర్పీని దింపుతా రు.. సీఆర్పీ సమ్మె చేస్తే మిలట్రీని దించినాడు.. మనలో మ నమే తన్నుకుంటేరో.. ఓ పోలీసన్న.. సర్కారోడు మురిసిపోయేరా.. ఓ పోలీసన్నా.. మంత్రి ఎనుక మంత్రి మారే.. మార లేదు నీ బతుకు.." అంటూ పోలీసుల సమస్యలపై ఆనాడో రాగం కట్టారు.

**ఆ తర్వాత పోలీస్ తల్లి వేదననూ ఆలకించారు.**

" పొట్ట కూటి కోసం కొడుకు పోలీసుల్లో చేరినాడు.. ఎప్పుడొస్తాడో కొడుకు.. యాడ ఉన్నాడో.. ఇంట్లా పీనుగున్నా కానీ.. వాడు ఇంగం పట్టలే కొడుకు.. కోడాలు నీళ్లాడిందన్నా.. కొడుకునూ ముద్దాడ రాలే..'' ఇప్పుడు రాష్ట్రంలో ఇవన్నీ నిజమవుతున్నాయి. రాష్ట్రంలో బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి భార్యలు ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీస్ ఉద్యోగంలో ఉంటూ ధర్నాలు, నిరసనలకు నాయకత్వం వహించారని తెలంగాణ పోలీస్ శాఖ ఆర్టికల్ 311ను ప్రయోగించింది. దీంతో ఏకంగా 39 మంది తెలంగాణ స్పెషల్ పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

### ఏక్ పోలీస్ అంటే ..?

ప్రస్తుతం తెలంగాణలో 13 బెటాలియన్లు ఉన్నాయి. వాళ్లలో అధికారులు, సిబ్బంది అంతా కలుపుకుంటే ఒక్కో బెటాలియన్‌లో వెయ్యిమంది వరకు ఉంటారు. పోలీస్ శాఖలో సివిల్, ఆర్మ్ డ్ రిజర్వ్ (ఏఆర్), స్పెషల్ పోలీస్ విభాగాల్లో సిబ్బందిని భర్తీ చేస్తుంటారన్న సంగతి తెలిసిందే. పోలీస్ స్టేషన్లలో ఉంటూ శాంతిభద్రతల పర్యవేక్షించడం, నేరాలను విచారించడం, నేరస్తులను గుర్తించడం, క్రైమ్ రేటును నిరోధించడం వంటి విధులు సివిల్ పోలీస్ సిబ్బంది చేస్తుంటారు. అయితే వాళ్లకి బందోబస్తు తదితర విధుల్లో ఆర్మ్ డ్ రిజర్వ్ పోలీసులు పనిచేస్తుంటారు. ఇక టీజీఎస్పీ పోలీస్ సిబ్బంది మాత్రం శాంతిభద్రతల విధుల్లో ఉంటారు. ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్తారు. అయితే ఈ స్పెషల్ పోలీస్ కానిస్టేబుళ్లు తమకు ఐదేళ్లలో ఏఆర్‌లోకి, ఆ తర్వాత ఐదేళ్లకు సివిల్ కానిస్టేబుల్‌గా మార్చాలని కానిస్టేబుళ్ల డిమాండ్ చేస్తున్నారు. కానీ రాష్ట్ర సర్వీస్ నిబంధనలు ఇందుకు ఒప్పుకోవని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించడం తీవ్రమైన విషయంగా పరిగణించాల్సి వస్తుందని డీజీపీ జితేందర్ ప్రకటన చేశారు. " తెలంగాణ రాష్ట్ర పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు కొన్ని దశాబ్దాలుగా అమల్లో ఉన్నాయి. జిల్లా స్థాయిలో నేర విచారణ చేయడం, నేరాలను నిరోధించడం, క్రిమినల్స్‌ను గుర్తించడం లాంటి విధులు సివిల్ పోలీస్ సిబ్బంది చేస్తుంటారు. బందోబస్తు తదితర విధుల్లో ఆర్మ్ డ్ రిజర్వు పోలీసులు ఉంటారు. ఇక టీజీఎస్పీ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతల అంశాల్లో విధులు నిర్వహిస్తుంటారు. అన్ని రాష్ట్రాలు కూడా ఈ విధానాలనే ఫాలో అవుతున్నాయి. టీజీఎస్పీ సిబ్బంది సమస్యలను మెరిట్ ప్రాతిపదికన సానుభూతితో పోలీస్ శాఖ పరిశీలిస్తుంది. ఇతర ప్రభుత్వ విభాగాల ఉద్యోగులకు లేనివిధంగా టీజీఎస్పీ సిబ్బందికి సరెండర్ లీవ్‌లు, అడిషనల్ సరెండర్ సెలవులు కూడా మంజూరు చేశాం. పండుగలు, సెలవుల సందర్భాల్లో టీజీఎస్పీ సిబ్బంది నిర్వహించే విధులను దృష్టిలో ఉంచుకొని వాళ్లకు ఈ సౌకర్యాలు కల్పిస్తున్నాం. జీతభత్యాలు ఇతర రాష్ట్రాల పోలీసులతో పోల్చుకుంటే ఇక్కడ ఎక్కువగా ఉన్నాయి. అలాగే ఆరోగ్య భద్రత వంటి సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ.. సిబ్బంది కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో టీజీఎస్పీ సిబ్బంది ఆందోళనలు చేపట్టడం సరైంది కాదు. యూనిఫామ్ ధరించే టీజీఎస్పీ సిబ్బంది అత్యంత క్రమశిక్షణతో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఏమైనా సమస్యలు ఉంటే వాళ్లకోసం నిర్వహిస్తున్న దర్బార్ కార్యక్రమం ద్వారా అధికారులకు తెలియజేయాలని" డీజీపీ వివరించారు.

### ఆవేదన వర్ణనాతీతం..

''గడిచిన మూడేళ్లలో నాలుగు నెలలు కూడా నా భర్త నాతో లేరు. మా బంధం చుట్టం చూపులా మారింది. డాడీ ఎందుకు లేడు అని పిల్లలు అడుగుతున్నారు. సింగిల్ పేరెంట్‌లా మా బతుకులు మారాయి. ఉద్యోగమే జీవితం కాదు కదా? ఇన్ని రోజులు ఓపికగా ఉన్నాం. ఇప్పుడు పరిస్థితి మరింత అధ్వానంగా చేయాలని చూస్తున్నారు. మా కుటుంబాలు సంతోషంగా లేవు" అని పోలీసు కుటుంబ సభ్యురాలు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఇంటెలిజెన్స్, వీఐపీ సెక్యూరిటీ వింగ్, సిటీ సెక్యూరిటీ వింగ్, సీఐడీ, కౌంటర్ ఇంటెలిజెన్స్, ట్రాన్స్ కో, జెన్ కో విభాగాలతో పాటు రాజ్‌భవన్, సెక్రటేరియట్, మినిస్టర్స్ క్వార్టర్స్, అసెంబ్లీ, ఢిల్లీ లోని సీఎం రెసిడెన్స్, తెలంగాణ భవన్ భద్రతా విభాగాల్లో తెలంగాణ స్పెషల్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని కొంతమంది తెలిపారు. ఇక, రాష్ట్రంలో హోమ్ మినిస్టర్ లేరు. ఆందోళనలను అర్థం చేసుకునే ప్రయత్నం అధికారులు చేయడం లేదు. పోలీసు సంక్షేమ సంఘం ముందుకు రావడం లేదు. ఐదేళ్లు స్థిరంగా ఒకే చోట ఉండేలా మార్పులు తేవొచ్చు. గతంలో సీనియర్ ఐపీఎస్ అధికారి జేవీ రాముడు ఈ సిఫార్సు చేశారు. దీని వల్ల బలగాలను తరలించే ఖర్చులు తగ్గి నిధులు ఆదా అవుతాయి'' అని విపక్షాలు భగ్గుమంటున్నాయి. "15 రోజులు డ్యూటీ చేస్తే నాలుగు రోజులు సెలవు ఇవ్వాలన్న గత ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ ప్రభుత్వం వెనక్కి తీసుకుంటోంది. గతంలో ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేశాం. కానీ ఇప్పటికీ ఉందని పోలీసు కుటుంబాలంటున్నాయి. ఏక్ పోలీస్ వ్యవస్థ తీసుకొస్తామని పీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వారిని పిలిచి మాట్లాడాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి, అధికారులకు లేదు'' అని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

### సర్కారు డిఫెన్స్

రాష్ట్రంలో బెటాలియన్ పోలీసుల నిరసనలు హోరెత్తుతున్నాయి. పోలీసులు వర్సెస్ పోలీసులుగా పరిస్థితి మారిపోయింది. ఖాకీ చొక్కాలతో రోడ్డెక్కారు. కుటుంబ సభ్యులతో సహా నిరసనలకు దిగుతున్నారు.ఈ నేపథ్యంలోనే సీఎం సెక్యూరిటీ వింగ్ కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం సెక్యూరిటీలో మార్పులు చేసింది. సీఎం రేవంత్ నివాసం దగ్గర బెటాలియన్ పోలీసు సిబ్బందిని సెక్యూరిటీల వింగ్ తొలగించింది. ఇప్పటి వరకు తెలంగాణ స్పెషల్ పోలీస్ సిబ్బంది సీఎం ఇంటి దగ్గర భద్రత కల్పించగా సోమవారం నుంచి ఆర్మ్ డ్ రిజర్వ్ పోలీసులను నియమించారు. సమస్యలు పరిష్కరించాలంటూ టీజీఎస్పీ పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి పెద్దఎత్తున నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో నిరసనలు చేస్తూ నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ క్రమశిక్షణా చర్యల పేరుతో 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను శనివారం పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆదివారం ఏఆర్ ఎస్సై, మరో హెడ్ కానిస్టేబుల్ సహా ఏకంగా 10 మందిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా వీరి ఆందోళనలు మాత్రం ఆగడం లేదు. తమకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని బెటాలియన్ పోలీసులు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రాష్ట్రంలో ప్రజా పీడన

- ఏ వర్గానికి న్యాయం జరగడం లేదు
- కంచె లేని పాలన అని ఆంక్షల పాలన తీసుకొచ్చారు
- రక్షకభటులకే రక్షణ లేని పరిస్థితి
- పోలీసు కుటుంబాలు రోడెక్కితే బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడరు..?
- మాజీమంత్రి హరీష్ రావు



**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో పదకొండు నెలల కాంగ్రెస్ పాలన చూస్తుంటే ప్రజా పాలన కాదు ప్రజా పీడన కనిపిస్తోందని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ వర్గానికి న్యాయం జరగలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. రేవంత్ పాలన తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన గళాలు వినిపిస్తున్నాయని అన్నారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ భవన్ లో మీడియాతో హరీష్ రావు మాట్లాడారు.. సీఎం రేవంత్ రెడ్డికి నోటికొచ్చినట్లు మాట్లాడటమే తెలుసని విమర్శించారు. అయితే ఎన్నికల్లో నోటికొచ్చినట్లు హామీలిచ్చి, ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ఇష్టానుసారంగా మాట్లాడటం పద్ధతి కాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా కేసీఆర్ రైతులకు రెండు పంటల కోసం రూ.10వేలు రైతుబంధు ఇచ్చారన్నారు. నాడు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే రేవంత్ రెడ్డి సీఎం కూర్చీ మీద కూర్చునప్పటికీ ఇప్పటి వరకు ఒక్క పంటకు కూడా రైతుబంధు ఇవ్వలేదని హరీష్ రావు ఆరోపించారు. కేసీఆర్ హ యాంలో తీసుకొచ్చిన పథకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోతోందని ఆయన మండిపడ్డారు. ఆడపడచులకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని ఒక్కటి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మంత్రులంతా పత్తి రైతుల కోసం కొబ్బరికాయలు కొడుతున్నారని, కానీ, ఒక్క దగ్గర కూడా ఇప్పటి వరకు పత్తి కొనుగోలు చేయలేదన్నారు వడ్లకు రూ.2,320 మద్దతు ధర రావాల్సి ఉండగా రూ.1800 నుంచి రూ.1900కే రైతులు అమ్ముకుంటున్న పరిస్థితి వచ్చిందన్నారు. పత్తికి రూ.7,521 మద్దతు ధర రాకపోవడంతో రూ.5,000 నుంచి రూ.5,500కే విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ భటులకే రక్షణ లేని పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. పోలీసుల మీద రేవంత్ రెడ్డి నిర్బంధం పెట్టడం ఏమిటని హరీష్ రావు ప్రశ్నించారు. పండుగపూట, పెళ్ళిల సమయంలో 144 సెక్షన్ పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. కంచెలు లేని పాలన అని చెప్పి , ఆంక్షల పాలన తీసుకొచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. పోలీసుల కుటుంబాలు రోడ్డెక్కి ధర్నా చేస్తుంటే బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని హరీష్ రావు ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ పాలనలోని లెక్కలు తీస్తాం

### కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్:** పదేళ్ల కాలంలో జరిగిన ప్రజాధనం ఖర్చు లెక్కలు తీస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ప్రజా పద్దుల కమిటీ సమావేశాన్ని కావాలనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బహిష్కరించారని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం సీఎల్పీ కార్యాలయంలో పీఏసీ సభ్యుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి యెన్నం శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అకౌంటెంట్ జర్నల్ చాలా ఆశ్చర్యకరమైన విషయాలు తెలిపారని, గత పది సంవత్సరాలుగా ఎన్నో అంశాలను బీఆర్ఎస్ సర్కార్ పెండింగ్ లో ఉంచిందన్నారు. లక్షల కోట్ల రూపాయలు ఇరిగేషన్ ప్రాజెక్టుల మీద ఇతర ప్రాజెక్టుల మీద బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ఖర్చు గురించి పీఏసీ దృష్టి సారించిందన్నారు. అందులోని లోపాలను, దొంగతనాన్ని భవిష్యత్తులో పీఏసీ ఎక్కడ నిజాలను వెలికి తీస్తుందోనని గమనించి, బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. పీఏసీ సమావేశం సాధారణంగా నెలకు కనీసం ఒకటి రెండు మార్లు నిర్వహించాలనే నిబంధన ఉన్నప్పటికీ, , గత బీఆర్ఎస్ ప్రభుత్వం 3 నెలలకు 6 నెలలకోసారి సమావేశాలు నిర్వహించారని ఆయన దుయ్యబట్టారు.

# నిరసనల ఎఫెక్ట్

- సీఎం సెక్యూరిటీలో మార్పులు
- బెటాలియన్ స్థానంలో ఆర్మ్‌డ్ రిజర్వు



**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** రాష్ట్రంలో బెటాలియన్ పోలీసుల నిరసనలు హోరెత్తుతున్నాయి. పోలీసులు వర్సెస్ పోలీసులుగా పరిస్థితి మారిపోయింది. ఖాకీ చొక్కాలతో రోడ్డెక్కారు. కుటుంబ సభ్యులతో సహా నిరసనలకు దిగుతున్నారు.ఈ నేపథ్యంలోనే సీఎం సెక్యురిటీ వింగ్ కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం సెక్యురిటీలో మార్పులు చేసింది. సీఎం రేవంత్ నివాసం దగ్గర బెటాలియన్ పోలీసు సిబ్బందిని సెక్యురిటీల వింగ్ తొలగించింది. ఇప్పటి వరకు తెలంగాణ స్పెషల్ పోలీస్ సిబ్బంది సీఎం ఇంటి దగ్గర భద్రత కల్పించగా సోమవారం నుంచి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులను నియమించారు. సమస్యలు పరిష్కరించాలంటూ టీజీఎస్పీ పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి పెద్దఎత్తున నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో నిరసనలు చేస్తూ నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ క్రమశిక్షణా చర్యల పేరుతో 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను శనివారం నాడు పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆదివారం నాడు ఏఆర్ ఎస్సై, మరో హెడ్ కానిస్టేబుల్ సహా ఏకంగా 10 మందిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ వీరి ఆందోళనలు మాత్రం ఆగడం లేదు. తమకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని బెటాలియన్ పోలీసులు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.


# గురుకులాల్లో మెరుగైన వసతులు..

**(మొదటిపేజీ తరువాయి)** ఐఐటీ, ఎన్ఐటీ, నీట్‌లో ఇచ్చే శిక్షణను మరింత అందించేలా ఇది ఉపయోగపడనుందని చెప్పారు.

### ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రస్తుతం విద్యార్థులకు ఇస్తున్న రెండు స్కూల్ డ్రెస్సులు, ఒక స్పోర్ట్స్ డ్రెస్‌తో పాటుగా రెండు నైట్ డ్రెస్సులు కూడా ఇవ్వాలని మీటింగ్‌లో ఆమోదించారు. 90 ప్రాంతాల్లో ఉన్న 104 గురుకుల విద్యాసంస్థల్లో ఆర్ఓ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గురుకుల విద్యాసంస్థల్లో సోలార్ వాటర్ హీటర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కూడా ఆమోదం తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని హైజేనిక్ కిచెన్‌తో పాటుగా స్కూల్ ఆవరణలో పరిశుభ్రత పాటించాలని మంత్రి సూచిం చారు. గురుకుల విద్యా సంస్థల్లో 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు నవోదయ మాదిరి నేరుగా ఇంటర్‌లోకి చేరేందుకు పర్మిషన్ కూడా ఇచ్చారు. ఇంటర్ బోర్డుతో అనుసంధానం చేసుకొని విద్యార్థులకు ఉపాధి కల్పించేలా అనేక వృత్తి విద్య కోర్సులను ప్రారంభించాలని మంత్రి సూచించారు. డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్న అధ్యాపకులకు సర్వీస్ రూల్స్ ను వర్తింపచేయాలని నిర్ణయించారు. వచ్చే వంద రోజుల తరువాత జరిగే సమావేశంలో సర్వీస్ రూల్స్ ఆమోదించుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌కి ఇన్ఫ్రాస్ట్రక్చర్ అత్యవసరమైనవి అందించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఆదేశించారు. వాష్ రూంలో ఉన్న సమస్యలు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంజేపీ స్కూల్ సెక్రటరీ బడుగు సైదులు, జాయింట్ సెక్రెటరీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్‌కు వ్యతిరేకంగా పోరాడిన న్యాయమూర్తి మృతి



**జనపదం, బెంగుళూరు:** ఆధార్ స్కీమ్‌కు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేసిన కర్నా టక హైకోర్టు మాజీ న్యాయమూర్తి కేఎస్ పుట్టస్వామి కన్నుమూశారు. 2012లో ఆధార్ నమోదుకు వ్యతిరేకంగా ఆయన సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేశారు. ఎటువంటి శాసనపరమైన మద్దతు లేకుం డానే ఆధార్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టి నట్లు ఆయన ఆరోపించారు. 98 ఏళ్ల వయసున్న పుట్టస్వామి.. ఫిబ్రవరి 8వ 1926లో జ న్మించారు. మైసూరులోని మహారాజ కా లేజీ, బెంగుళూరులోని లా కాలేజీలో వి ద్యాభ్యాసం పూర్తి చేశారు. 1952లో ఆ యన అడ్వకేట్‌గా నమోదు చేసుకున్నారు. హైకోర్టుకు ప్రభుత్వ అదనపు అడ్వకేట్ గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆధార్‌ను తప్పనిసరి చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు.



## చిన్నారి వేదశ్రీ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

**జనపదం, హైదరాబాద్** : హైడ్రా కూల్చివేతల కారణంగా ఇంట్లోని తన పుస్తకాలు కోల్పోయిన చిన్నారి వేదశ్రీ కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఇల్లు కూల్చివేసిన రోజు ఏం జరిగిందో వేదశ్రీ తో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలు కోల్పోయిన వేదశ్రీకి పుస్తకాలతో పాటు బ్యాగులను అందించారు. వారి కుటుంబానికి కూడా కేటీఆర్ ఆర్థికసాయం అందించారు. కాగా, హైడ్రా కూల్చివేతల కారణంగా మా పిల్లలు, కుటుంబం మొత్తం రోడ్డున పడిందని కేటీఆర్ కు వేదశ్రీ కుటుంబ సభ్యులు తమ ఆవేదనను చెప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే చేసిన రిజిస్ట్రేషన్లలో కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తూ పేదల పట్ల రేవంత్ సర్కార్ నిర్దయగా వ్యవహరించిందంటూ మండిపడ్డారు. సడెన్ గా వచ్చి పేదల ఇండ్లను అప్పటికప్పుడు కూల్చివేయటమనేది చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పేదలు అన్న మానవత్వం కూడా చూపించకుండా ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచాలకు తప్పకుండా ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. వేదశ్రీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హైడ్రా బాధితులందరికీ బీఆర్ఎస్ తరపున న్యాయ సాయం అందిస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పారు.

## రేవంత పన్నాగం బెడిసి కొట్టింది

**ఎమ్మెల్సీ తాతా మధు సూదన్**

**జనపదం, ఖమ్మం :** రాజకీయ ప్రత్యర్థిని దొడ్డి దారిలో దెబ్బ కొట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పన్నిన పన్నాగం బెడిసి కొట్టిందని ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాతా మధు సూదన్ అన్నారు. ప్రత్యర్థి కుటుంబ సభ్యులను అప్రతిష్ఠ పాలు చేసి రాజకీయాల్లో అప్పర్ హ్యాండ్ సాధించాలను కోవడం ఆయన రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనం దుయ్య బట్టారు. సోమవారం బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో తాతా మధు సూదన్ మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ ను రాజకీయంగా ఎదుర్కోలేక డ్రగ్స్ పేరుతో ఆయన కుటుంబ సభ్యులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 70 ఏళ్ల వయసున్న వృద్ధులతో పాటు మహిళలు, పిల్లలు, బంధువులు చేసుకున్న దావత్ ను భూతద్దంలో చూపే ప్రయత్నం చేయడం ఆయన వక్ర బుద్ధికి నిదర్శనమన్నారు. డ్రగ్స్ కానీ మరే ఇతర అసహజ పోకడలు, ఆనవాళ్లు దొరకనప్పుడు మాములు అంశంగా వది లేస్తే, ఇంతగా రేవంత్ రెడ్డి అబాసు పాలు అయ్యేవాడు కాదన్నారు. డ్రగ్స్ లేవు, రేవ్ పార్టీ కాదు, కేవలం ఫ్యామిలీ దావత్ జరిగిందని తెలిశాక కూడా రేవంత్ రెడ్డి టీమ్ చిల్లర మల్లర పనులకు పూనుకున్నారని విమర్శించారు. ఆ దావత్లో అసలు డ్రగ్స్ లేవని అధికారులు స్పాట్ లోనే ప్రకటించడం రేవంత్ రెడ్డికి చెంప పెట్టులాంటిదన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, కేటీఆర్ పై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. కాంగ్రెస్, బీజేపీ సోషల్ మీడియా వేదికగా డ్రగ్స్ దొరికినట్లు పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసి సునకానందం పొందారని మధు సూదన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మీడియా సమావేశంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల నాగ రాజు, సీనియర్ పార్టీ నాయకుడు ఆర్ జేసీ కృష్ణ, బి.రెడ్డి నాగచంద్రా రెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు ఉప్పల వెంకట రమణ, లీగల్ సెల్నాయకులు బిచ్చల తిరుమల రావు, రూరల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, నాయకులు పగడాల నరేందర్, లింగ బోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు సీడీవో

- మొదటిదశలో 15 కేంద్రాల్లో అమలు
- 80 శాతం రోడ్డు ప్రమాదాలు డ్రైవర్ల తప్పిదాల వలనే
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**జనపదం, సెక్రటేరియట్ :** రోడ్డు ప్రమాదాల నివారణకు కంపల్సరీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ (సీడీవో) చేపట్టాలని రవాణా శాఖ నిర్ణయించిందని ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. మొదటిదశలో 15 కేంద్రాల్లో సీడీవో అమలు చేస్తామని చెప్పారు. దీనిలో భాగంగా ప్రయోగాత్మకంగా ఉమ్మడి జిల్లాలో 9 కేంద్రాలు, హైదరాబాద్ లో ఆరు రవాణా శాఖ కేంద్రాల్లో అమలు చేస్తామన్నారు. కంపల్సరీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా ఎవరైతే లైసెన్స్ తీసుకోవడానికి లెర్నింగ్ లైసెన్స్ కి శాశ్వత లైసెన్స్ కి మధ్య జరిగే వీడియో అవగాహన కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా కొత్తగా రోడ్డు మీదకి వస్తున్న వాహనదారులు ఈ 3 గంటల వీడియో ద్వారా కంపల్సరీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ పై అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో రవాణా శాఖ అధికారు లు, స్వచ్ఛంద సంస్థలతో సమీక్షా సమావేశాన్ని మంత్రి పొ న్నం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో రోజురోజుకు పెరుగుతున్న మరణాల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా వాణా శాఖ ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు వెళ్తుందన్నారు. 2023 లో దేశంలో లక్షా 73 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని ఇందులో 45 శాతం 35 సంవత్సరాలలోపు ఉన్న యువత రోడ్డు ప్రమాదాల్లో మరణించగా ఇందులో 44 శాతం మంది ద్విచక్ర వాహన ప్రమాదాల్లో మరణించినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అయితే 80 శాతం రోడ్డు ప్రమాదాలు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు.

# జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, కుల సంఘ నాయకులు, ఎన్జీవోలు, ప్రజాప్రతినిధులతో సమావేశం



**జనపదం, ఆదిలాబాద్** : తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషా ను ఖరారు చేసే అంశం బహిరంగ విచారణను సోమవారం అదిలాబాద్ జిల్లా జడ్పీ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల ఉమ్మడి జిల్లాకు సంబంధించి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి బృందంతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, కుల సంఘ నాయకులు, ఎన్జీవోలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కుల సంఘాల నాయకులు, ఎన్జీవోలు, ప్రజాప్రతినిధులు రాతపూర్వకంగా సమర్పించిన అభిప్రాయాలు, అభ్యర్థనలను కమిషన్ కు వెల్లడించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ వారు వెల్లడించిన అభిప్రాయాలలో గ్రహించిన విషయాలు ముఖ్యంగా విద్యా, సామజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణపై సూచనలు చేశారన్నారు. 90 రిప్రెజెంటేషన్ లు స్వయంగా స్వీకరించామన్నారు. కుల సంఘాలు, ప్రజలు ఏవైనా సూచనలు, సలహాలు ఇవ్వాలనుకుంటే వచ్చే నెల 13 వ తేదీ 5.00 గంటల లోగా బీసీ కమిషన్ కార్యాలయం, ఖైరతాబాద్ జలమండలి, 4 వ అంతస్తులో నేరుగా గానీ, పోస్ట్ ద్వారా గానీ అందజేయవచ్చని తెలిపారు.

**ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం..**

తెలంగాణాలో సమగ్రంగా అన్ని కులాల సర్వే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సర్వే ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణాలో మొత్తం జనాభాలో బీసీలు ఎంత మంది ఉన్నారు. ఆ దామాషాలో బీసీ కమిషన్ పర్యవేక్షణలో ముఖ్యమంత్రి ప్లానింగ్ కమిటీకి బాధ్యతలు అప్పగించడం జరిగిందని, బీసీ కమిషన్ లో ఒక నమూనా ప్రశ్న పత్రాన్ని తయారుచేయడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని ఆదిలాబాద్ నుండే శ్రీకారం చుట్టడం ఎంతో సం తోషంగా ఉందని, రిజర్వేషన్లు ఖరారు చేసే ముందు పది జిల్లాలలో ఈ సర్వేను నిర్వహించడం జరుగుతుందని, ప్రజల అభిప్రాయాలను సేకరించే దిశలో మొదటగా ఆదిలాబాద్ ను ఎంచుకోవడం జరిగిందన్నారు. కుల సంఘాలు సమర్పించిన రిప్రెజెంటేషన్ లో ఏబీసీడీలలో మార్పులు చేయాలని, 42 శాతం రిజర్వేషన్ కావాలని, స్థానికంగా క్షేత్ర స్థాయిలో బీసీ సంఘాలు ఎంత మంది ఉన్నారో కుల సంఘాల వారు సర్వే కు వచ్చినపుడు సమగ్రంగా సమాచారం సేకరించాలి. సర్వే సమగ్రంగా ఇంటింటికి ఎన్యుమరేటర్లు వెళ్లి సమాచారాన్ని సేకరించడం విజయవంతం కావాలంటే పాత్రికేయుల సహకారం అందించాలని, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి శ్రద్ధ వహించిన కలెక్టర్ కి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ లు, వివిధ సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర బిసి కమిషన్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సంఘాల నుండి వారి అభిప్రాయాలను, సలహాలను సేకరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం అంత క్రమ పద్ధతిలో, రిజిస్ట్రేషన్ అయిన తర్వాత ప్రతి ఒక్కరి దగ్గరి నుండి ఆరు సెట్లు తీసుకోవడం జరిగిందని అన్నారు. వీడియోగ్రఫి తో కమిషన్ కు నివేదిక సమర్పించడం జరుగుతుందని అన్నారు. సమగ్ర సర్వే నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా నుండి మాస్టర్ ట్రైనర్ లు ఈ రోజు హైదారాబాద్ లో శిక్షణ తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు శ్యామలా దేవి, వేణు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజలింగు, ఆర్డీవో వినోద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కుల గణనలో తెలంగాణ మోడల్..

- ప్రజల అభిప్రాయానికి పట్టం కడుతాం
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయబోతున్నం..
- కలెక్టర్లతో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వచ్చే నెల 6 నుంచి ప్రక్రియ ప్రారంభం
- కులగణన పై సామాజిక వేత్తలు, మేధావులతో సమావేశం



**జనపదం, సెక్రటేరియట్ :** రాష్ట్రంలో చేపట్టనున్న కుల గణన దేశవ్యాప్తంగా ఒక మోడల్ గా నిలుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సామాజికవేత్తలు, మేధావులతో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. కుల గణనలో చేయాల్సిన మార్పులు, చేర్పులు ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారితో సమాలోచనలు జరిపారు. రాష్ట్రంలో వచ్చే నెల 6 నుంచి చేపట్టనున్న కులగణనకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, దిశా నిర్దేశం చేయడానికి నేడు (మంగళ వారం) కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి సమాచారం తీసుకునేందుకు ఇంకా ఎలాంటి ప్రశ్నలు వేస్తే బాగుంటుంది అని వారిని సలహాలు అడిగారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 మంది సామాజికవేత్తలు, మేధావులు, అభ్యుదయ వా దుల తో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను, సందేశాలను పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. వీరితో పాటు కుల సంఘాలు, యువజన సంఘాలను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు. వీరితో పాటు బీసీ కమిషన్, ఎస్సీ ఎస్టీ కమిషన్ ఇతర భాగస్వాముల అభిప్రాయాలను సేకరిస్తామని వివరించారు. ప్రణాళిక శాఖ రూపొందించిన ప్రశ్న పత్రం సమగ్రంగా ఉందని సామాజికవేత్త యోగేంద్ర యాదవ్ లాంటి మేధావులు అభినందించిన విషయాన్ని ఈ సందర్భంగా వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ గ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేస్తామని ఎన్నికలకు ముందు కామారెడ్డి లో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ బహిరంగ సభలో ప్రకటించామని, ఆ తర్వాత కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని పొందుపరిచామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసెంబ్లీలో తీర్మానం చేసి ఇచ్చిన హామీని అమలు చేయడానికి కార్యరూపం తీసుకువచ్చామని తెలిపారు. పాత కమిషన్ కాలం ముగిసిన వారంలోపే కొత్త బీసీ కమిషన్ వేశామని, బీసీ సంక్షేమం అభ్యున్నతి పట్ల ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అని తెలిపారు. ఇప్పటికే నాలుగు జిల్లాల్లో 56 ఇండ్లు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని కులగణన సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. న్యాయ పరమైన చిక్కులు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ మురళి మనోహర్ సూచించారు. రోజుకు ఒక ఎన్యుమరేటర్ 15 ఇండ్లు సర్వే చేయడం భారం అవుతున్న నేపథ్యంలో ఆ సంఖ్యను పదికి కుదించాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ సింహాద్రి, సామాజిక విశ్లేషకుడు పాశం యాదగిరి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మూణ్నెళ్ల కోసారి సమీక్షించుకోవాలి

- సమస్యల పరిష్కార మార్గాలను అన్వేషించుకోవాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బి.వెంకటయ్య.
- నవంబర్ 12న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల లైజన్ సెల్ ప్రారంభం.
- సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్



**జనపదం, హైదరాబాద్** : సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి లైజన్ ఆఫీసర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని, ప్రమోషన్లు, పోస్టింగులలో ఈ వర్గాలకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి. వెంకటయ్య అన్నారు. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, కమిషన్ సభ్యులు, సింగరేణి లోనీ ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు, ఉద్యోగ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్న స మావేశంలో చైర్మన్ బక్కి. వెంకటయ్య మాట్లాడుతూ.. అధికారులకు ప్రమోషన్లు కల్పించే కమిటీలలో, రక్షణ కమిటీలలో ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి కనీసం ఇద్దరిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. తద్వారా ఆ కులాల వారికి అన్యాయం జరగకుండా చూసే అవకాశం ఉంటుందన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ జాతికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన విగ్రహాలను ప్రతీ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేయాలని, సింగరేణి సంస్థ చైర్మన్ గా ఉన్న ఎన్. బలరామ్ ఇప్పటికే అన్ని రకాల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తున్నారని, కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలను కూడా పరిష్కరించాలని సూచించారు.

సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ కమిషన్ చైర్మన్ సూచించిన విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి సింగరేణీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో పేర్కొన్న ప్రతి సమస్యను తాను నమోదు చేసుకున్నాననీ, నిబంధనలు మేరకు అన్ని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కమిషన్ సూచన మేరకు సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల లైజన్ సెల్ కార్యాలయా న్ని కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో ఏర్పాటు చేశామని, నవంబర్ 12వ తేదీన దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సమావేశం ప్రారంభంలో అన్నిఏరియాల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు వివిధ రకాల ప్రమోషన్లు, బదిలీలలో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సమస్యలను తిరిగి కమిషన్ సంస్థ చైర్మన్ కు వివరించగా, వాటిపై నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటాన ని సీఎండీ బలరామ్ హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్ తో పాటు సింగరేణి సంస్థ నుంచి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్, పర్సనల్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జీఎం కో ఆర్డినేషన్ ఎస్ డీఎం సుభాని, జీఎంలు శామ్యూల్ సుధాకర్, కవిత నాయుడు, బెనడిక్ట్ నికోలస్, ఎస్సీ చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్, ఎస్టి చీఫ్ లైజన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య, జీఎం లు సురేష్ బాబు, బండి వెంకటయ్య, సూర్య నారాయణ, డీజీఎం పర్సనల్ అజయ్ కుమార్, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘాల నాయకులు, ఏరియాల లైజన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## బ్యారేజీ పనులను జరగనివ్వం..

**పరిహారం కోసం మేడిగడ్డ ముంపు రైతుల డిమాండ్**

**జనపదం, మహాదేవపూర్** : మేడిగడ్డ బ్యారేజీ వలన బ్యాక్ వాటర్ తో పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని పొరుగున ఉన్న మహారాష్ట్రలోని మద్దికుంట, అరుడ, చింతలపల్లి గ్రామాల రైతులు ఆందోళన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జానంపల్లి సర్వే నెంబరు 339, 318,334,104, 338,105లో మద్దికుంట, అరుడ, చింతలపల్లి గ్రామాలలో వివిధ సర్వే నెంబర్లలోని సుమారు 500 ఎకరాలు మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్ వాటర్ తో పూర్తిగా నష్టపోతున్నామని వాపోయారు. మహరాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. మాకు న్యాయం జరిగేంతవరకు మేడిగడ్డ పనులను నిలిపివేస్తామని రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు ముద్దం తిరుపతి, రమేష్, మహేష్, శ్రీనివాస్, మంతయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రక్షాళన షురూ..

(మొదటిపేజీ తరువాయి) డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. ఇటీవల రెవెన్యూ సంఘాలు పదోన్నతులు, బదిలీలపై ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలోనే బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో బదిలీ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పలువురు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, భూ సేకరణ అధికారులు, సివిల్ సప్లయిస్ వంటి శాఖల్లో పని చేస్తున్న వారిని బదిలీ చేశారు. ఎవ్వరూ ఊహించని విధంగా స్థాన చలనం చేశారు. కొందరికేమో వారు కోరుకున్న సీట్లు రాలేదు. మరికొందరికీ వారు ఆశించని విధంగా ప్రాధాన్యత కలిగిన డివిజన్లకు బదిలీ కావడం గమనార్హం. వెయిటింగ్ లోని పది మంది ఆ ర్డీవోలకు కూడా పోస్టింగ్స్ లభించాయి. డిప్యూటీ కలెక్టర్లు ఎల్.రమేష్, ఎన్. ఆనంద్ కుమార్, హన్మనాయక్ లకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. వారిని రెవెన్యూ శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు సోమ వారం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

**త్వరలోనే కొత్త చట్టం**

దీపావళికి కొత్త రెవెన్యూ చట్టం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియకు ముందే అధికారుల బదిలీలు చేపట్టారు.

**రెవెన్యూ ప్రక్షాళన**

**కొత్త చట్టానికి ముందు భారీ బదిలీలు**

**70 మంది డిప్యూటీ కలెక్టర్లు, ఎస్డీపీల ట్రాన్స్‌ఫర్**

రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏకంగా 70 మంది డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. ఇటీవల రెవెన్యూ సంఘాలు పదోన్నతులు, బదిలీలపై ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలోనే బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో బదిలీ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పలువురు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, భూ సేకరణ అధికారులు, సివిల్ సప్లయిస్ వంటి శాఖల్లో పని చేస్తున్న వారిని బదిలీ చేశారు. ఎవ్వరూ ఊహించని విధంగా స్థాన చలనం చేశారు. కొందరికేమో వారు కోరుకున్న సీట్లు రాలేదు. మరికొందరికీ వారు ఆశించని విధంగా ప్రాధాన్యత కలిగిన డివిజన్లకు బదిలీ కావడం గమనార్హం. వెయిటింగ్ లోని పది మంది ఆర్డీవోలకు కూడా పోస్టింగ్స్ లభించాయి. డిప్యూటీ కలెక్టర్లు ఎల్. రమేష్, ఎన్. ఆనంద్ కుమార్, హన్మనాయక్ లకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. వారిని రెవెన్యూ శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

# రైతు సంక్షేమానికి ప్రాధాన్యం..

- సాంకేతిక పరిజ్ఞానంతో లాభాలు పెంచేలా పైలట్ ప్రాజెక్ట్ రూపొందిస్తున్నాం
- చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం..
- దీపావళి నుంచి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- మంథని మార్కెట్ యార్డ్, ఏక్లాస్ పూర్ లో కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**జనపదం, మంథని** : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంథని మార్కెట్ యార్డ్, ఏక్లాస్ పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరంగా సమస్యలు ఉన్న రైతులకు కూడా త్వరలోనే రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామని అన్నారు. గత ప్రభుత్వాల కంటే అధికంగా ప్రజా ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. రైస్ మిల్లుల్లో రైతులకు ఎవరైనా తరుగు పేరిట కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. రైతుకు మద్దతు ధర విషయంలో ఎటువంటి నష్టం కలగకుండా పౌర సరఫరాల సంస్థ, మార్కెటింగ్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. రైస్ మిల్లుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, రైతులకు, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తూ రైస్ మిల్లులు పని చేయాలని మంత్రి కోరారు. ప్రభుత్వ హయాంలో రైతులకు కరెంట్ ఇబ్బందులు లేకుండా అవసరమైన సబ్ స్టేషన్ లను ఏర్పాటు చేసుకున్నామని, మోటార్లకు కరెంట్ ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. డిజిటల్ ఫార్మింగ్, డ్రోన్ ఫార్మింగ్ పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని, ముందుకు వచ్చే గ్రామాలలో ఈ కార్యక్రమం అమలు చేస్తామని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని రైతులకు ఎలా అధికంగా లాభాలు రావాలి, ఉత్పత్తి ఎలా పెంచాలి అంశాలను పరిశీలిస్తూ డ్రోన్ ఫార్మింగ్ అమలుకు చర్యలు చేపట్టామని అన్నారు. రైతుల సమాచారం తెలుసుకొని సాంకేతికంగా ఉత్పత్తి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యల పై సూచనలు సలహాలు అందిస్తామని అన్నారు.మార్కెట్ యార్డులో ఉన్న గోదాముల సామర్థ్యం పెంపుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ పథకాలు ప్రారంభించామని, మిగిలిన పనులు కూడా ఆర్థిక వ్యవస్థను బాగు చేస్తూ గ్యారెంటీ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పేదలు మంచి చదువులు చదువుకునేందుకు సమీకృత విద్యాలయాలు నిర్మిస్తున్నామని, కార్పొరేట్ స్కూల్ లకు దీటుగా ఇవి ఉంటాయని, దీపావళి నుంచి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభిస్తున్నామని, గ్రామ సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని, ఇండ్లు ఉన్న వారికి మంజూరు చేసే ప్రసక్తే లేదని, నిరుపేదలకు మాత్రమే మొదటి దశలో అందిస్తామని, గ్రామ సభలలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని అన్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రివర్యులు వెంట సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## క్రచ్‌ను ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల..

**జనపదం, గోదావరిఖని :** మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు సోమవారం ఆర్ జీ త్రీ జీ ఎం ఆఫీస్ లో మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన క్రచ్ సెంటర్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఐఎన్ టీయూసీ సెక్రెటరీ జనరల్ రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్ జనక్ ప్రసాద్ పాల్గొన్నారు. జనక్ ప్రసాద్ అభ్యర్థన మంత్రి శ్రీధర్ బాబు సూచన మేరకు ఆర్ జీ–3 జీఎం ఆఫీస్ మహిళ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు క్రెచ్ ను పరిశీలించిన ఐ ఎన్ టీయూసీ నాయకులు త్వరలోనే సీఎండీ బలరాం నాయక్ తో మాట్లాడి కొత్తగూడెం కార్పొరేట్ ,హైదరాబాద్ సింగరేణి భవన్ తో పాటు అన్ని ఏరియాల్లో ఇట్టి సౌకర్యాన్ని కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## ఢిల్లీలో నకిలీ లాయర్లు..

**107 మందిని తొలగించిన బార్ కౌన్సిల్**

**జనపదం, న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో నకిలీ లాయర్ల సంఖ్య పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) దీనిపై దృష్టిసారించింది. గత ఐదేళ్లలో ఒక్క ఢిల్లీలోనే 107 మంది నకిలీ న్యాయవాదులను తొలగించింది. లాయర్ల సమగ్రత, వృత్తి నైపుణ్యాన్ని కొనసాగించడానికి ఈ డ్రైవ్ చేపట్టినట్లు బార్ కౌన్సిల్ తెలిపింది. ఇందులో భాగంగా 2019 నుంచి 2024 అక్టోబర్ వరకు ఢిల్లీలో 107 మంది నకిలీ లాయర్లను తొలగించినట్లు పేర్కొంది. ఈ నిర్ణయాత్మక చర్య ద్వారా నకిలీ న్యాయవాదులను, చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేని వారిని తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు బార్ కౌన్సిల్ తెలిపింది. అక్టోబర్ 26న ఈ మేరకు ఒక స్టేట్ మెంట్ విడుదల చేసింది. కాగా, ప్రజల విశ్వాసాన్ని, అనైతిక పద్ధతుల నుంచి న్యాయ వ్యవస్థను రక్షించడానికి బార్ కౌన్సిల్ ప్రయత్నిస్తున్నదని బీసీఐ కార్యదర్శి శ్రీమంతో సేన్ తెలిపారు. ఇందులో భాగంగా ఒక్క ఢిల్లీలో 107 మంది నకిలీ న్యాయవాదుల పేర్లను రిజిస్టర్ జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. 2019 నుంచి 2023 జూన్ 23 వరకు వేల మంది నకిలీ న్యాయవాదులు నమోదైనట్లుగా గుర్తించినట్లు వివరించారు. సమగ్ర విచారణ తర్వాత వారిని తొలగిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు కొందరు వ్యక్తులు నకిలీ సర్టిఫికేట్‌లతో న్యాయవాదులుగా వ్యవహరిస్తున్నారని శ్రీమంతో సేన్ తెలిపారు. తప్పుడు పత్రాలు, వివరాలతో న్యాయ మండలిలో పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ క్రియాశీల పరిశీలన తర్వాత నకిలీ లాయర్లను గుర్తించి తొలగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరికొందరి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వివరించారు.

# మెగాస్టార్ కు అక్కినేని పురస్కారం..

**ప్రదానం చేసిన అమితాబ్**
**భావోద్వేగానికి గురైన చిరంజీవి**

**జనపదం, హైదరాబాద్ సిటీ:** చిరంజీవికి అక్కినేని జాతీయ అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో అమితాబ్ బచ్చన్ అక్కినేని జాతీయ పురస్కారాన్ని మెగాస్టార్ కు అందజేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం చిరంజీవి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారని, కానీ, తన సినీ ప్రస్థానంలో రచ్చ గెలిచానన్నారు. ఇంట గెలిచే అవకాశం సినీ వజ్రోత్సవాల్లో వచ్చిందని పేర్కొన్నారు. తనకు లెజెండరీ అవార్డు ప్రదానంతో ధన్యుడిగా భావించానని, కానీ దానిని కొందరు హర్షించలేక పోయారని అందుకే అవార్డును తీసుకోవడం సరికాదనిపించిందన్నారు. అందుకే అదే రోజు లెజెండరీ అవార్డును క్యాప్సుల్ బ్యాక్ లో వేశానన్నారు. ఆఖరికి పద్మవిభూషన్ సహో ఎనో అవార్డులు వచ్చినా ఆ అసంతృప్తి ఇంకా మిగిలే ఉందన్నారు.







# ఢిల్లీలో అధ్వానస్థితికి గాలి నాణ్యత

**జనపదం, న్యూఢిల్లీ:** దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికితోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ దారుణ స్థితికి పడిపోయినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. సోమవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ 328 వద్ద నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ముఖ్యంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఏక్యూఐ 357 గా నమోదైనట్లు పేర్కొంది. ఇక అక్షర్‌ధామ ఆలయం వద్ద 357గా గాలి నాణ్యత నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు వెల్లడించింది. గాలి నాణ్యత క్షీణించడంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు.

## ప్రస్తుతానికి సేఫ్..

(మొదటిపేజీ తరువాయి) డిస్కం వార్షిక టారిఫ్ ప్రతిపాదనలపై ఈఆర్సీ సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. ప్రభుత్వం నుంచి డిస్కంలకు రావాల్సిన బకాయిలు సుమారు రూ.25వేల కోట్లుగా ఉందని, డిస్కంలు నష్టాలు తగ్గించుకునేందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వీలైనంత త్వరగా తీసుకోవాలని సూచించారు. ఎరియర్స్ తొందరగా ఇస్తే డిస్కంలు తొందరగా నష్టాల నుంచి బయటపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.



# సమగ్రంగా సర్వే

**(మొదటిపేజీ తరువాయి)** చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు ప్రణాళికలు సైతం సిద్ధమయ్యాయి. ఈ సర్వే కోసం అవసరమైన 3 వేల సిబ్బందికి ఇప్పటికే తగు శిక్షణ షెడ్యూల్ కూడా పూర్తి చేసింది. ఈ గణన సందర్భంగా సిబ్బంది 15 రోజుల పాటు క్షేత్ర స్థాయిలోనే ఉండనున్నారు. ప్రజలకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించనున్నారు. ఇలా రాష్ట్రంలోని 1.10 కుటుంబాల నుంచి వివరాలను సేకరించనున్నారు. ఈ కులగణనలో మొత్తంగా 54 ప్రశ్నలకు వివరాలు సేకరించనున్నారు. ఇందులో సగం కుటుంబ నేపథ్యంపై ప్రశ్నలు ఉండగా.. మిగిలిన సగం వ్యక్తిగత వివరాలకు సంబంధించినవని తెలుస్తోంది. తినే తిండి నుంచి మొదలుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఏఏ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.. ఇంటి యజమాని ఉపాధి ఏంటి.., ఏడాదికి కుటుంబ ఆదాయం ఎంత అనే ప్రశ్నలన్నీ ప్రజలను అడగనున్నారు. గత బీఆర్ ఎస్ సర్కారు 2014 లో సమగ్ర సర్వే చేసి వివరాలు గోప్యంగా ఉంచడంపై అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కులగణనలో ఎలాంటి వివాదాలు, ఆరోపణలు రాకుండా పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఈ అంశంలో సామాజికవేత్తలు, యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సస్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించింది. వారి నుంచి తగు సూచనలు, సలహాలు కూడా స్వీకరించింది. అదే సమయంలో న్యాయ పరమైన చిక్కులు రాకుండా కులగణన సాఫీగా జరగడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది.

**రాష్ట్రంలో 3.80 కోట్లకు పైగా జనాభా..**

రాష్ట్రంలో ప్రస్తుతం 3.80 కోట్లకు పైగా జనాభా ఉన్నారు. మొత్తం కుటుంబాల సంఖ్య 1.10 కోట్లు దాటి ఉంటుందని అంచనా. దీనికి తగ్గట్టుగానే సిబ్బంది నియామకానికి ప్రణాళికశాఖ ప్రతిపాదనలు రూపొందించింది. అయితే ప్రతి 150 కుటుంబాలకు ఓ సర్వే గణకుడిని నియమిస్తారు. ఈ లెక్కన చూసుకుంటే మొత్తం 75 వేల మంది అవసరం ఉంటుంది. వీళ్లపై పర్యవేక్షకులుగా మరో 15 వేల మంది వరకు అవసరం అవుతుంది. ఇందుకోసం వీళ్లందరినీ నియమించేందుకు అన్ని శాఖల సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఉపాధ్యాయులను ఇలాంటి సర్వేలకు పంపించొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖలోనే టీచర్లు కాకుండా 15 వేల మంది ఇతర ఉద్యోగులను ఈ సర్వే కోసం నియమించనున్నారు. జిల్లాల్లో కుటుంబాల సంఖ్య ఆధారంగా కనీసం 2500 నుంచి 3 వేల మంది ఉద్యోగులను అన్నిశాఖల నుంచి ఈ సర్వే కోసం పంపిస్తారు. వీళ్లందరూ కూడా 15 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారు. ఒకసారి సర్వే పూర్తయ్యాక వివరాలు పక్కాగా సేకరించారా లేదా అని కూడా ఆ తర్వాత తనిఖీ సర్వే కూడా చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ నెలఖారులోగా సర్వేను ప్రారంభించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తం 60 రోజుల్లోగా సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని లక్ష్యం పెట్టుకున్నారు.

## దశల వారీగా..

**మొదటి దశ**లో కుటుంబ సభ్యుల సంఖ్య సేకరిస్తారు. తర్వాత కుటుంబ యజమాని, సభ్యులు, యజమానితో సంబంధం, జెండర్, మతం, కులం/సామాజిక వర్గం, ఉప కులం, కులానికి సంబంధించిన ఇతర పేర్లు, వయస్సు, మాతృభాష, ఆధార్ నంబర్ సేకరించనున్నారు.

**రెండో దశ**లో ఓటర్ ఐడీ కార్డు. దివ్యాంగులైతే దాని పూర్తి వివరాలు. మ్యారిడ్, అన్ మ్యారిడ్. వివాహ కాలం నాటికి వయసు, ఆరేళ్ల వయసులోపు పాఠశాలలో చేరారా లేదా?, ఏ పాఠశాల. విద్యార్హతలు, 6–16 ఏళ్ల మధ్య బడి మానేస్తే ఆ సమయానికి చదివిన తరగతి, బడి మానేయటానికి కారణాలు, 17–40 ఏళ్లలోపు వారు విద్యను కొనసాగించకపోవడానికి గల కారణాలు, నిరక్షరాస్యులవడానికి కారణాల వివరాలను సేకరిస్తారు.

**మూడో దశ**లో ప్రస్తుతం చేస్తున్న వృత్తి, స్వయం ఉపాధి. దాని వివరాలు. రోజువారీ వేతనం ఎంత? ఏ రంగంలో పనిచేస్తున్నారు?. కులవృత్తి ఏమిటి, ప్రస్తుతం కులవృత్తిని కొనసాగిస్తున్నారా? కులవృత్తి కారణంగా వ్యాధులబారినపడ్డారా?. వార్షికాదాయం, ఆదాయ పన్ను కడుతున్నారా?, బ్యాంకు ఖాతా ఉందా లేదా? వంటివి తీసుకుంటారు.

**నాలుగో దశ**లో రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొందిన విద్య ప్రయోజనాలు, ఉద్యోగ అవకాశాలు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన కుల ధ్రువీకరణ పత్రం ఉందా? లేదా?. సంచార లేదా పాక్షిక సంచార తెగకు చెందిన వారా?, రాజకీయ నేపథ్యం ఏమిటి?, ప్రజా ప్రతినిధిగా ఉంటే ప్రస్తుతం ఏ పదవిలో ఉన్నారు?. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధిగా పనిచేశారు. నామినేటెడ్ లేదా కార్పొరేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ సంస్థలలో సభ్యులుగా ఉన్నారా? వంటివి రికార్డు చేయనున్నారు.

**ఐదో దశ**లో కుటుంబం పేరుమీద ఎంత భూమి ఉంది. ధరణి పాస్‌బుక్, పాస్‌బుక్ నంబర్, భూమిరకం వివరాలు. తర్వాత ఆ భూమి వారసత్వమా? సొంతంగా కొన్నదా? బహుమతిగా వచ్చిందా?, అసైన్డ్ భూమా?, అటవీ హక్కుల ద్వారా పొందినదా? అనే వివరాలు. అలాగే భూమికి ప్రధాన నీటి వనరు, ఎన్ని పంటలు పండుతాయి, ఏమైనా రుణాలు తీసుకున్నారా?, ఏ అవసరం నిమిత్తం తీసుకున్నారు?, ఎక్కడి నుంచి తీసుకున్నారు?, వ్యవసాయ అనుబంధంగా ఏదైనా పనిచేస్తున్నారా? అనే వివరాలు తీసుకుంటారు.

**ఆరో దశ**లో ఆ కుటుంబానికి చెందిన పశుసంపద వివరాలను కూడా రికార్డుల్లో పొందుపరచనున్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, బాతులు, ఇతరత్ర పెంపుడు జీవులను సైతం లెక్కించనున్నారు. వాటినుంచి వచ్చే ఆదాయం? ప్రభుత్వం సహకారంపై ఆరాతీయనున్నారు.

**ఏడో దశ**లో కుటుంబ ఆస్తులకు సంబంధించి.. స్థిరా, చరాస్తుల వివరాలు. ప్రభుత్వం నుంచి పొందిన ప్రయోజనాలు, నివాస గృహం రకం, మరుగుదొడ్డి, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఇంటికి విద్యుత్ సదుపాయం వంటి వివరాలను సేకరించనున్నారు.

## బీసీల లెక్కలే ముఖ్యం..

ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల వారు ఎందరనే లెక్కల కొసమే ఈ సర్వే చేపడుతోందని తెలుస్తోంది. వాళ్లతో పాటుగా రాష్ట్ర ప్రజల్లో ప్రతి ఒక్కరి కులం, ఉపకులం ఏంటి, స్థానికంగా కులాల పేర్లలో ఏమైనా మార్పులు జరిగాయా ఇలాంటి వివరాలన్నీ కూడా సేకరిస్తారు. ఎవరిదైనా కులం పేరు తప్పుగా నమోదైతే భవిష్యత్తులో అనేక రకాలుగా నష్టం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. తప్పుడు వివరాలు నమోదు కాకుండా స్థానిక అధికారులు పటిష్ఠంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగానే భవిష్యత్తులో సంక్షేమ పథకాలతో పాటు అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. ప్రతీ ఒక్కరి ఆధార్ కార్డు, పాన్ కార్డ్, మొబైల్ నంబర్లతో పాటు వివిధ వివరాలను నమోదు చేస్తారు. విద్యార్హత, ఉద్యోగం, సొంత ఇల్లు, కారు, బైకు వంటివి ఉన్నాయా అని ఇలా పూర్తి సమాచారాన్ని సేకరించనున్నారు. జనాభా లెక్కలకన్నా ఎక్కువ సమాచారాన్ని ఈ సర్వే నుంచి ప్రభుత్వం సేకరించనున్నట్లు తెలుస్తోంది.



# హైడ్రా ఓ బ్లాక్ మెయిల్ సంస్థ

- రేవంత్ అండ్ క్యాబినెట్ నిర్వాకం ప్రజలు గమనిస్తున్నారు
- పెద్ద బిల్డర్లను బ్లాక్ మెయిల్ చేసి వసూళ్లు చేస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బుచ్చమ్మ కుటుంబానికి పరామర్శ..
- అండగా ఉంటామని భరోసా..

**జనపదం, హైదరాబాద్ సిటీ:** హైడ్రా ఒక బ్లాక్ మెయిల్ సంస్థ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కార్ హైడ్రాను పేదల మీదకు ఉసిగొల్పి, నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లను కూలగొడుతూ భయానక వాతావరణాన్ని సృష్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద బిల్డర్లను బ్లాక్ మెయిల్ చేసి వసూళ్ళు చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం హైడ్రా కూల్చివేతల క్రమంలో కూకట్ పల్లిలో ప్రాణాలు కోల్పోయిన బుచ్చమ్మ కుటుంబాన్ని మాజీమంత్రి కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్థం, పర్థం లేకుండా ఆనాలోచితంగా గుడ్డెద్దు చేలో పడినట్లు కూకట్ పల్లిలోని నల్ల చెరువు వద్ద కూల్చివేతలు చేశారని మండిపడ్డారు. హైడ్రా అనే సంస్థ కారణంగానే బుచ్చమ్మ బలవన్మరణం పొందిందని ఆరోపించారు. బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, హైడ్రా అనే అరాచక సంస్థతో రేవంత్ రెడ్డి చేయించిన హత్య అన్నారు. రేవంత్ సర్కార్ దిక్కుమాలిన చర్యల కారణంగా పేదలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. బుచ్చమ్మ కుటుంబానికి అండగా బీఆర్ఎస్ పార్టీ నిలబడి , ఆర్థిక సాయం చేసిందన్నారు. హైడ్రా బాధితులందరికీ న్యాయసాయం బీఆర్ఎస్ చేస్తుందని హామీ ఇచ్చారు.

**ప్రజలపై రేవంత్ పగ..**

హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్ కు ఓటు వేసినందుకే రేవంత్ ప్రభుత్వం పగ, కసి పెంచుకుందని కేటీఆర్ దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గం ఏం చేస్తుందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పెద్ద పెద్ద బిల్డర్లను రేవంత్ రెడ్డి సర్కార్ బెదిరించి వసూళ్ళకు పాల్పడుతుందని ఆరోపించారు. హైడ్రాతో ఆర్థిక మంత్రికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఆర్థికమంత్రి ఎందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారని నిలదీశారు. పేదల ఇళ్ళకు నోటీసులు ఇస్తున్న హైడ్రా సంస్థ, ఎఫ్టీఎల్ పరిధిలో ఇళ్ళు నిర్మించిన రేవంత్ రెడ్డి సోదరుడి కి ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎన్నో హామీలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కడతామని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఒక్క ఇల్లు కట్టలేదని ఆయన ఆరోపించారు. కానీ ఎన్ని ఇళ్లు కూలగొట్టరో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ లో మాత్రమే కాదు ఊళ్లలో కూడా రేవంత్ రెడ్డి అరాచకం గురించి మాట్లాడుతున్నారని కేటీఆర్ అన్నారు.





# ఇప్పుడు యాదికొచ్చిందా..?

- ఇన్నాళ్లు ఏం చేసినట్టో..
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- బీజేపీ, కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు..
- ఓబీసీల లెక్కలు తేల్చాలని డిమాండ్..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** ఇన్నేళ్లు దేశాన్ని పరిపాలించింది కాంగ్రెస్, బీజేపీలు మాత్రమే., ఇప్పుడు వాళ్లకి ఓబీసీ కులగణన గుర్తు రావడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ దుయ్యబట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ఏ పార్టీ నోట విన్నా ఓబీసీలకు అన్యాయం జరిగిందని అంటున్నాయని, రాహుల్ గాంధీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ పార్టీలు ఓబీసీ గురించి మాట్లాడుతున్నాయన్నారు. ఇన్నాళ్లు లేనిది వీళ్లకు ఇప్పుడు ఓబీసీ కులగణన గుర్తుకు వచ్చిందన్నారు. బ్రిటీష్ కాలంలో కులగణన జరిగిందని, జంతువులకు కూడా లెక్కలుంటాయని, కానీ, జనాభాలో 65 శాతం ఉన్న ఓబీసీల కులగణన ఎంతో తెలియకపోవడం బాధాకరం అన్నారు.

**తిరుగుబాటు వస్తుందని భయం..**

ఓబీసీల కులగణన జరిగితే ప్రభుత్వాలపై తిరుగుబాటు వస్తుందని నేతలంతా భయపడుతున్నారన్నారు. కులగణన చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉందని, అధికారం రాష్ట్రాలకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. బిహార్, మహారాష్ట్ర సర్కార్లు ఓబీసీ కులగణన చేస్తామంటే కేంద్రం ఒప్పుకోలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఓబీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బిహార్ లో 63.1 శాతం ఓబీసీలు ఉన్నట్లుగా కులగణనలో తేలిందని, మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. దేశంలో అన్ని వర్గాల లెక్కలు ఉండాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిందని, కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని, బీసీ డిక్లరేషన్ వలనే బీసీలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై ముందుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల విషయంలో ఏదో సాకుతోతప్పించుకునే ప్రయత్నం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.





# బీసీ కమిషన్ వచ్చిందోచ్..

- మొదలైన జిల్లాల పర్యటనలు
- షెడ్యూల్ విడుదల..
- నవంబర్ 13 వరకు అభ్యంతరాల స్వీకరణ..

**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఉమ్మడి జిల్లాల పర్యటనకు బీసీ కమిషన్ శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఆదివారం నిజామాబాద్ నుంచి పర్యటనలు మొదలుపెట్టింది. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి పర్యటనలో ఉన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై బీసీ కమిషన్ బహిరంగ విచారణలను ప్రారంభించింది. రిజర్వేషన్లను ఫైనల్ చేసేందుకు సామాజిక, ఆర్థిక, విద్య, కుల సర్వేలతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ప్రజల నుంచి సూచనలు తీసుకుంటున్నది. ఆయా వర్గాలతో సమావేశాలు నిర్వహించింది. ఈ పర్యటనలు వచ్చే నెల 13 వరకు ఉమ్మడి జిల్లా కేంద్రాలు, రాష్ట్రస్థాయి కమిషన్ కార్యాలయాల్లో సూచనలు తీసుకుంటామని ఇప్పటికే కమిషన్ ప్రకటన విడుదల చేసింది. ఇందుకోసం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించి కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేసింది.

నిజామాబాద్ నుంచి మొదలైన పర్యటన సోమవారం ఆదిలాబాద్లో పర్యటన చేసింది. రిజర్వేషన్ల ఖరారుకు ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాల నుంచి రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. మరోవైపు న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా శాస్త్రీయపద్ధతిలో కులగణన నిర్వహించాలని, రిజర్వేషన్ల శాతాన్ని పెంచడంతోపాటు కులవృత్తుల ఆధునీకరణకు సైతం ఊతమివ్వాలని బీసీ కులసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లు, పారిశ్రామిక రంగంలో సబ్సిడీలు, భూముల కేటాయింపు, బీసీ సబ్‌ప్లాన్, బీసీ కులాల ఉత్పత్తులకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేకమైన సెజ్‌లు, ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం వంటి అంశాలతోపాటు కులాల వారీగా సమస్యలను, వాటికి తాము సూచిస్తున్న పరిష్కార మార్గాలను అమలుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

**షెడ్యూల్ ఇలా...**

ఈ కార్యక్రమాన్ని తొలుత ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రారంభించారు. ఆ తర్వాత ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లారు. ఈ నెల 29న మళ్లీ నిజామాబాద్, 30న సంగారెడ్డి, నవంబరు 1న కరీంనగర్, 2న వరంగల్, 4న నల్గొండ, 5న ఖమ్మం, 7న రంగారెడ్డి, 8న మహబూబ్‌నగర్, 11న హైదరాబాద్ జిల్లాల్లోని కలెక్టరు కార్యాలయాల్లో విచారణ ఉంటుంది. 12న కమిషన్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, కులసంఘాలు, సంక్షేమ సంఘాలు, 13న రాష్ట్ర ప్రజలందరితో నిర్వహించే సమావేశాలతో బహిరంగ విచారణ ముగుస్తుంది. కాగా, ఈ బహిరంగ విచారణలో పాల్గొని అభ్యంతరాలు చెప్పలేకపోయిన వారు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా నవంబరు 13 వరకు కమిషన్ కార్యాలయానికి పంపించవచ్చు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com